క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌ను కలిసిన రెడ్డి సంఘం నాయకులు



విప్‌కు వినతిపత్రం ఇస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

కథలాపూర్: మండల రెడ్డి జన సంక్షేమ సంఘం సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మంగళవారం వేములవాడలో కలిశారు. దుంపేట శివారులోని ఎస్సారెస్పీ వరదకాలువకు చెందిన స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి ఇప్పించి, నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కేతిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, భూమరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

డప్పులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

మండలకేంద్రంలోని అంబేడ్కర్ మాదిగ సంఘం సభ్యులకు కాంగ్రెస్ నాయకుడు న్యావనంది శేఖర్ తన సొంత ఖర్చులతో డప్పు కళాకారులకు డప్పులు, టీ షర్ట్‌లు కొనుగోలు చేయగా, వీటిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతులమీదుగా వారికి అందించారు.

పాఠశాలలో ఆకతాయిల విధ్వంసం



చెల్లాచెదురైన వస్తువులు, సామగ్రి

రాయికల్: మండలంలోని తాట్లవాయి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు విధ్వంసం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బోగ రమేశ్ మంగళవారం తెలిపారు. దసరా సెలవుల అనంతరం మంగళవారం పాఠశాల పునః ప్రారంభం కాగా, గుర్తుతెలియని ఆకతాయిలు పాఠశాలలోని రెండు తరగతి గదుల తలుపులు బద్దలు కొట్టి 8 ఫ్యాన్లు, 3 కుర్చీలు విరగొట్టగా బోధన సామగ్రిని చెల్లాచెదురుగా పడేశారు. సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందని, దీనిపై ఎస్సై సుధీర్‌రావుకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పెగడపల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన గడ్డం తిరుపతి అనేవ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకుని పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి పోయిన సెల్‌ఫోన్‌ను గుర్తించి మంగళవారం అందజేసినట్లు ఎస్సై సీహెచ్ రవికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ తిరుపతి పాల్గొన్నారు.

తాట్లవాయిలో డీఎస్పీ విచారణ



విచారిస్తున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్: మండలంలోని తాట్లవాయి గ్రామానికి చెందిన పాలెపు సురేశ్‌ను అదే గ్రామానికి చెందిన ఆకుల మల్లేశం, నందగిరి గోపాల్ అనే ఇద్దరు వ్యక్తులు కులం పేరుతో దూషించారని ఇటీవల బాధితుడు ఫిర్యాదు చేయగా, మంగళవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఆయన వెంట రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సుధీర్‌రావు ఉన్నారు.

బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను, పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. 100 డయల్‌కాల్స్‌కు త్వరగా స్పందించాలని, రాత్రి వేళల్లో నిఘా పెంచి దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిస్తే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన భద్రి వెంకటి ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడగా మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి గంప కరుణాకర్ 4 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. వాహనదారులు వాహనానికి ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలన్నారు.

నిధులున్నా.. పనులెప్పుడో?

- రూ.4 కోట్లు కేటాయింపు
- మారని రోడ్ల పరిస్థితి
- ఎదురుచూస్తున్న ప్రజలు



భూషణరావుపేట శివారులో రోడ్డు పరిస్థితి



రాళ్లు తేలి అధ్వానంగా తయారైన భూషణరావుపేట-ఆత్మకూర్ రోడ్డు

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారాయి. మట్టి రోడ్లను తారు రోడ్డుగా మార్చాలని ఏళ్లుగా ప్రజలు విన్నవించుకున్నారు. ఎట్టకేలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో గతేడాది ఆగస్టు నెలలో నిధులు మంజూరు కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పనులు రద్దయ్యాయి. కొన్ని నెలలకు అవే రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో అధ్వానంగా ఉన్న రోడ్లకు మహర్దశ పడుతుందా లేదా ఆయా గ్రామాల ప్రజలు నిరీక్షిస్తున్నారు.

సీఆర్‌ఆర్ నిధులు రూ.4కోట్లు మంజూరు

కథలాపూర్ మండలం భూషణరావుపేట నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వెళ్లేందుకు 3.5 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు, చింతకుంట నుంచి కథలాపూర్ శివారులోని గుండు పెరమాండ్ల ఆలయం వరకు 3 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని సీఆర్‌ఆర్ నిధులు కేటాయించారు. మట్టి, రాళ్ల రోడ్లు తారురోడ్లుగా మారుతున్నాయని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. నిధులు మంజూరై నెలలు గడిచినా తట్టెడు మట్టి పనులు చేయకపోవడం దారుణమని ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, పాలకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గుంతలు, రాళ్ల రోడ్ల నుంచి రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని.. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాళ్ల రోడ్డుతో అవస్థలు



ప్రతీరోజు భూషణరావుపేట నుంచి ఆత్మకూర్ వైపు వ్యవసాయ పనులకు బైక్‌పై వెళ్తుంటాం. వర్షాలకు రోడ్డంతా దెబ్బతిని కంకర రాళ్లు తేలాయి. బైకుపై ఒక్కరు వెళ్తేనే అదుపు తప్పి పడిపోతామని భయపడుతున్నాం. వర్షాకాలంలో పంటలు సాగుకవసరమయ్యే వస్తువులను తీసుకుపోవుడు కష్టమవుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి తారు రోడ్డు పనులు త్వరగా చేయించాలి.

– గడ్డం దేవారెడ్డి, రైతు, భూషణరావుపేట

వీలైనంత త్వరగా పనులు చేయిస్తాం



భూషణరావుపేట–ఆత్మకూర్, చింతకుంట– కథలాపూర్ రోడ్ల మరమ్మతుకు సీఆర్‌ఆర్ నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయింది. వీలైనంతా త్వరగా పనులు చేయించాలనే లక్ష్యంతో ఉన్నాం.

– జగదీశ్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ,

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

ధర్మపురి: సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలో ఉన్న ముత్యాల పోశమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్యవేదిక సంఘం వారు డిమాండు చేశారు. విగ్రహం ధ్వంసంను నిరసిస్తూ మంగళవారం ధర్మపురి పట్టణంలో హిందూ ఐక్యవేదిక వారి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై రాజుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

చిట్టాపూర్‌లోయువకుల నిరసన

మల్లాపూర్: సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగున్ని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో మంగళవారం యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సామాజికవేత్త విష్ణువర్ధన్‌రాజు, యువజన సంఘాల సమితి నాయకులు అంజిరాజ్ దండుగుల, అందె సత్యం, లింగారెడ్డి పాల్గొన్నారు.

చిన్నారికి ఇన్ఫెక్షన్



ఇన్ఫెక్షన్ అయిన చిన్నారి కాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బీరయ్యగుడి వద్ద జల అనే మహిళకు మూడునెలల పాప ఉంది. కాగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, పాపకు టీకా వేయించారు. టీకా వేసిన చోట ఇన్ఫెక్షన్ సోకింది. మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు ఇన్ఫెక్షన్ అయిందని సర్జరీ చేసి చీమును తొలగించారు. అయినప్పటికీ ఇన్ఫెక్షన్ నయం కాలేదు. వైద్య శిబిరంలో టీకా వేసిన ఏఎన్‌ఎం నిర్లక్ష్యంగా వేశారని వారు ఆరోపిస్తున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

జగిత్యాల: ప్రస్తుత కాలంలో పర్యావరణాన్ని కాపాడుకోవాలని, లేని పక్షంలో భావితరాలకు ముప్పు వాటిల్లుతుందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రపరిశోధక ఆచార్యులు డాక్టర్ నీలి వాసవి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రయ్య, ప్రమోద్‌కుమార్, వరప్రసాద్, నీరజ, రాంచంద్రం పాల్గొన్నారు.

యాదవ సంఘ సభ్యులపై కేసు నమోదు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ యాదవ సంఘ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు.యాదవ సంఘ సభ్యులు ఈ నెల 10వ తేదీన తన ఇంటిపైకి దాడికి వచ్చారని,గ్రామానికి చెందిన చిలివేరి దిలీప్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.దీంతో కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.

హార్వేస్టర్ నిర్వాహకులతో అధికారుల సమావేశం

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలంలోని హార్వేస్టర్ నిర్వాహకులకు మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ మాట్లాడుతూ కోత సమయంలో రైతుల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగు సూచనలిచ్చారు. ఆర్పీఎంను 16 నుంచి 18 మధ్య ఉంచితే నాణ్యమైన ధాన్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సురేందర్ నాయక్, నరేందర్ ,సాయి ప్రియ ,స్రవంతి, అనిల్, హార్వేస్టర్ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్

ధర్మపురి: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హిందూ సేన ఆధ్వర్యంలో ఈనెల 4న ప్రారంభమైన డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న హాజరై విజేతలకు నగదుతో పాటు కప్స్, షీల్డ్స్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజు నిర్వాహకులు అప్పం తిరుపతి, లక్ష్మణ్, వెంకీ, బాకీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని అభినందించిన వీహెచ్‌పీ నాయకులు

జగిత్యాలక్రైం: జిల్లాలో వినాయక చవితి నిమజ్జనం, బతుకమ్మ, దసరా, దుర్గ నవరాత్రోత్సవాలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు ఎస్పీని కలిసి సన్మానించారు. ప్రశాంత వాతావరణంలో పండగలు జరిగేందుకు సహకరించిన ప్రజలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ వేణుగోపాల్, వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

జగిత్యాల: దసరా, వినాయక చవితి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను బీజేపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మి, రాజు, రవీందర్, సుధాకర్, శ్రీనివాస్, కిశోర్‌సింగ్, చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు స్వాగతం



అయ్యప్ప దీక్షాపరులను సన్మానిస్తున్న భక్తులు

కథలాపూర్: మెట్‌పల్లి పట్టణానికి చెందిన అయ్యప్ప దీక్షాపరులు శబరిమాలకు పాదయాత్రగా వెళ్తుండగా, మంగళవారం కథలాపూర్‌లో భక్తులు వారికి స్వాగతం పలికారు. అయ్యప్పదీక్షాపరులకు ఫలాలు అందించారు. అనంతరం పాదయాత్రగా వెళ్తున్న 19 మందిని సన్మానించారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్ష మండలి సభ్యులు నాగేశ్వర్‌రావు, ఆకుల రాజేశ్, చిన్నారెడ్డి, బచ్చు కిషన్, ఆమెట గంగాధర్, సతీశ్‌గౌడ్, పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ముత్యాల వెంకట్‌రెడ్డి

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన వైద్యుడు ముత్యాల వెంకట్‌రెడ్డి మంగళవారం నిజామాబాద్‌లో ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. 2009లో ఆయన లోక్‌సత్తా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అనంతరం 2014లో టీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు రైతు నాయకులు బొత్కూరి రాజారెడ్డి, గోనెల రాజిరెడ్డి, బద్దం గంగాధర్ కూడా ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఏలేటి నరేందర్‌రెడ్డి ఉన్నారు.

మర్రవ్వ దేవతను దర్శించుకున్న ఎస్పీ తల్లిదండ్రులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులోని మర్రవ్వ దేవతను ఎస్పీ అశోక్‌కుమార్ తల్లిదండ్రులు కెప్టెన్ దివాన్, ఆర్యా మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు గణేశ్, ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం 290 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యుడు డాక్టర్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ, మూడు నెలలు నిండిన అన్ని రకాల పశువులకు గాలి కుంటు టీకాలు వేయించాలని, నిర్లక్ష్యం చేస్తే పాడి పశువులు చనిపోయే ప్రమాదముందని చెప్పారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మండలంలోని చౌలమద్ది,వెల్లుల గ్రామాల్లో మంగళవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారిణి మనీషా తెలిపారు. ఉచిత టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగులో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంపద సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లిలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పశువైద్యాధికారి రాజ్‌కుమార్ కార్యదర్శి మంజుల, మాజీ సర్పంచ్ కొండయ్య, గోపాలమిత్ర జానీపాషా, తిరుపతి, నర్సయ్య పాల్గొన్నారు.

బట్టపల్లికి ఆర్టీసీ బస్సు నడిపించాలి

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్‌స్కూల్ కోసం ఉదయం 7.45 మాత్రమే బస్సు వస్తోందని, ప్రజలకు కోసం బస్సు నడిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే డిపో మేనేజర్‌కు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

యాదవ సంఘ సభ్యులపై కేసు నమోదు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ యాదవ సంఘ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు.యాదవ సంఘ సభ్యులు ఈ నెల 10వ తేదీన తన ఇంటిపైకి దాడికి వచ్చారని,గ్రామానికి చెందిన చిలివేరి దిలీప్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.దీంతో కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.



జగిత్యాలటౌన్: పట్టణంలోని ధరూర్ క్యాంపు రామాలయం వెనుక వైపు నుంచి అంతర్గాం బైపాస్ రోడ్డులోని ఎస్సారెస్పీ డీ61డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కబ్జాదారులకు వరంగా మారింది. కలెక్టరేట్‌కు అతి సమీపంలో ఉన్న ఈ కెనాల్‌ను కబ్జా అవుతోంది. కాలువల కబ్జాతో వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్‌కు లేఖ రాసినా పరిస్థితిలో మార్పు లేదు. ఇంత జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు భూములను కాపాడాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సుధాకర్‌రెడ్డి,చీఫ్ ఇంజనీర్ నీటిపారుదల శాఖ, సెల్ నంబర్: 9100902434

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న పీఏసీ చైర్మన్



గాంధీ, సత్యంకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

కొండగట్టు: కొండగట్టు అంజన్నను మంగళవారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మన్, శేర్ లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్,ఆదిరెడ్డి,రాజనర్సింగ రావు,ముత్యం శంకర్,ఈవో రామకృష్ణరావు, ఆలయ ఏఈవో అంజయ్య,ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వీవీరావుపేట జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేట జెడ్పీ పాఠశాలలో 2007–08, 2008–09లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మంగళవారం వేర్వేరుగా అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు చదువు చెప్పిన అప్పటి హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, స్వామి, గంగాధర్‌లను సన్మానించారు.



కోరుట్ల జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998–2000 సంవత్సర ఇంటర్ మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇరవై నాలుగేళ్ల తరువాత వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆత్మీయతను పంచుకుని సంబరంగా గడిపారు.

నియామకం

కథలాపూర్ ట్రాన్స్‌కో ఏఈగా దివాకర్‌రావు

కథలాపూర్: కథలాపూర్ మండల ట్రాన్స్‌కో ఏఈగా దివాకర్‌రావును నియమిస్తూ విద్యుత్‌శాఖ జిల్లా అధికారి సాలియా నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన ఏఈ ఎం.డీ జమీల్‌పాషా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి బదిలీ అయ్యారు. గొల్లపెల్లి మండలంలో ఏఈగా పనిచేస్తున్న దివాకర్‌రావును కథలాపూర్ ఏఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దివాకర్‌రావు బుధవారం కథలాపూర్‌లో బాధ్యతలు తీసుకుంటారని స్థానిక అధికారులు పేర్కొన్నారు.

మాదిగ సంఘం భీమారం మండల అధ్యక్షుడిగా దువాస గంగాధర్

మేడిపల్లి: భీమారం మండల మాదిగ సంఘం అధ్యక్షుడిగా ఓడ్యాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, దువాస గంగాధర్ ఎన్నికయ్యారు. మంగళవారం సంఘం నాయకులు సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గడ్డం శశికుమార్, ఉపాధ్యక్షుడిగా తెడ్డు విజయ్, ప్రధాన కార్యదర్శిగా చిలివేరి వెంకటేశ్, కోశాధికారిగా బంగారు దీపక్, ప్రచార కార్యదర్శిగా ఆరే దరి, కార్యదర్శిగా మకిలి కుమార్ ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన సంఘ సభ్యులకు గంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మాజీపేట గాంధీ తండా అధ్యక్షుడిగా శేఖర్

రాయికల్: మండలంలోని ధర్మాజీపేట గాంధీ తండా అధ్యక్షుడిగా అంగోతు శేఖర్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా నాగవత్ సురేందర్‌నాయక్‌లను మంగళవారం తండావాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో గాంధీ తండా అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.

సమాచారం

దరఖాస్తులు ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న టీజీటీ సైన్స్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కొల్లూరి సంతోష్ తెలిపారు. బీఎస్సీ బీఈడీ, టెట్ అర్హత, బీఈడీ మెథడాలజీలో ఫిజికల్ సైన్స్, బయోలజీ కలిగి ఉండాలని, ఈనెల 18లోపు దరఖాస్తులు చివరి తేదీ కాగా, 19న డెమో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఓటరు నమోదుపై నేడు అవగాహన సదస్సు

కోరుట్ల రూరల్: మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఇట్యాల కిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులు, సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

18న వెంకన్న హుండీ లెక్కింపు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు ఈ నెల 18న ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో విక్రమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాయి ఆలయ హుండీ ..

కోరుట్ల పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ హుండీలను ఈ నెల 18 ఉదయం 12 గంటలకు లెక్కించనున్నట్టు ఆలయ ఈవో కె. కాంతారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా: 9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల: రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899